# రైతులు లేని రేవంత్ యాత్ర

- పెయిడ్ కార్యకర్తలతోనే మొత్తం కథ
- 6 కి.మీ అని చెప్పి 2.25 కి.మీకి కుదింపు
- 30 వేలు అని చెప్పి.. 3 వేల మందితో మమ
- వెయ్యి మంది ఆఫీసర్లు, 2 వేల మంది పోలీసులతో షో
- స్క్రిప్టెడ్, ప్రీప్లాన్డ్ మూసీ షో అని విమర్శలు
- ఒడ్డున అప్పటికప్పుడు బోట్లు, తెప్పలు
- సీఎం మాట్లాడగానే తట్టాబుట్టా ఖాళీ
- వృత్తిదారులంతా కాంగ్రెస్ కార్యకర్తలే

యాదాద్రి భువనగిరి, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి జిల్లాలో సీఎం పాదయాత్ర షోపుటప్, హంగామా, డ్రామాను తలపించింది. మూసీపై ఏదో చేస్తున్నామనే భ్రమ కల్పించాలని భావించి చేపట్టిన కార్యక్రమం కాస్తా అట్టర్ ఫ్లాప్ అయిందనే చర్చ నడుస్తున్నది. 'అంతా స్క్రిప్టెడ్, ప్రీప్లాన్డ్.. పెయిడ్ కార్యకర్తలు.. ప్రతిపక్షాన్ని విమర్శించేందుకే రేవంత్ ఈ ప్రోగ్రామ్ పెట్టుకున్నట్టు ఉన్నది' అనే విమర్శలు గుప్పుమన్నాయి.

**హడావుడి.. హంగామా..**

రేవంత్ పాదయాత్ర నేపథ్యంలో వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్ద కొత్త సినిమానే చూపించే ప్రయత్నం చేశారు. సినిమా సెట్‌లా అప్పటికప్పుడు ఒడ్డున బోట్లు, తెప్పలు వేయించారు. ఎంపిక చేసిన వారినే పాదయాత్రలో సీఎం వెంట నడిపించారు. బోట్లు, తెప్పల వద్ద వివిధ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలనే నిలబెట్టారు. వారిని పలకరిస్తే 'అధికారుల ఆదేశాల మేరకు వచ్చినం' అని చెప్పడం కొసమెరుపు. వారికి ఐడీ కార్డులు కూడా ఇవ్వడం గమనార్హం. గుర్తింపు కార్డులో మాత్రం గజ ఈతగాళ్లు అని అధికారులు పేర్కొన్నారు. మూసీ నీటితో చేపలు బతకడం లేదని, శుద్ధి చేయాలని రేవంత్‌రెడ్డి ముచ్చటించిన మత్స్యకారుడు యాదయ్య కోరారు. ఆయన సొంతూరు పోచంపల్లి. అక్కడ ఉన్నవారితో రేవంత్‌రెడ్డి మాట్లాడిపోయిన పావు గంటలోనే గజ ఈతగాళ్ల పేరుతో వచ్చిన వాళ్లు తమ తట్టాబుట్టా సర్దుకొని అక్కడి నుంచి వెళ్లిపోవడం కనిపించింది. కార్యక్రమం కోసం తాత్కాలికం వీరిని తీసుకొచ్చి కథ నడిపించారని విమర్శలు వినిపించాయి.

**వృత్తిదారులు అంటూ కాంగ్రెస్ నేతలతో ప్రసంగాలు..**

రేవంత్‌రెడ్డి పాదయాత్ర అనంతరం ప్రచారరథంపై ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అంతకంటే ముందు మరోసారి కథ రక్తి కట్టించే ప్లాన్ చేశారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అప్పటికే తాను ఓ పేపర్‌లో రాసుకొచ్చిన పేర్లను ఒక్కొక్కరిగా ప్రచార రథంపైకి పిలిచి ప్రసంగించాలని ఆహ్వానించారు. సదరు వ్యక్తులను కుల వృత్తిదారులుగా పరిచయం చేశారు. వేదికపై ప్రసంగించిన కే వెంకటేశ్, నాగరాజు ఇద్దరూ కాంగ్రెస్‌కు చెందిన వారే కావడం గమనార్హం. ఇద్దరి ప్రసంగాల్లోనూ రేవంత్‌రెడ్డిని ప్రశంసలు, పొగడ్తలతో ఆకాశానికెత్తారు. ఇప్పుడే అంతా ఏదో జరిగిపోయినట్టు మాట్లాడారు. సీపీఎం నేత ఐలయ్యకు కూడా అవకాశం ఇవ్వగా సీఎం దేవుడు, గొప్ప వ్యక్తి, శిరస్సు వంచి వందనాలు అంటూ మాట్లాడటం గమనార్హం. అంతకుముందు పాదయాత్ర సందర్భంగా సీఎం ముచ్చటించిన వృత్తిదారులకు కూడా ముందు రోజే అధికారులు స్క్రిప్ట్ ఇచ్చి తర్ఫీదు ఇచ్చినట్టు తెలిసింది.

**2.25 కిలోమీటర్లే యాత్ర**

రేవంత్‌రెడ్డి పాదయాత్ర షెడ్యూల్‌కు, అమలుకు సంబంధమే లేకుండా పోయింది. మొదట 6 కిలోమీటర్ల మేర సీఎం పాదయాత్ర చేస్తారని ప్రకటించారు. కానీ 2.25 కిలోమీటర్లు మాత్రమే పాదయాత్ర కొనసాగింది. ధర్మారెడ్డిపల్లి కాల్వ వైపు వెళ్తున్న క్రమంలో మధ్యలోనే కుదించారు. పాదయాత్ర ఆసాంతం గందరగోళంగా మారింది. అంతకుముందు రేవంత్‌రెడ్డి రెండు సార్లు మూసీలోకి దిగి ఫొటోలకు ఫోజులిచ్చారు.

**అధికారులు, సిబ్బందే 3 వేల మంది..**

సీఎం యాత్రలో అన్ని విభాగాల అధికారులను భాగస్వాములను చేశారు. కలెక్టర్ హనుమంతరావు అన్ని విభాగాల అధిపతులతో సమీక్ష నిర్వహించి బాధ్యతలు అప్పగించారు. కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు సుమారు వెయ్యి మంది అధికారులు విధులు నిర్వర్తించారు. పాదయాత్రలో ఎక్కడ చూసినా అధికారులే కనిపించారు. సుమారు 2 వేల మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వర్తించినట్టు అధికారులు తెలిపారు.

**30వేల మందికి.. 3 వేలే**

సుమారు 30వేల మందితో కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేస్తామని ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పారు. కానీ 3 వేల మంది కూడా వచ్చినట్టు అనిపించలేదు. మధ్యాహ్న సమయంలో వచ్చిన కొందరు సాయంత్రానికి ఇంటి బాట పట్టారు. రేవంత్‌రెడ్డి ప్రసంగించే సమయంలో పెద్దగా జనం లేరు. ఎటు చూసినా ఖాళీ ప్రదేశాలే కనిపించాయి. నాలుగు వైపులా ఉన్న సింగిల్ రోడ్లు కూడా నిండకపోవడం గమనార్హం.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సంగెం వద్ద మూసీలో అప్పటికప్పుడు తాత్కాలికంగా ఏర్పాటుచేసిన బోట్

## అంతా పెయిడ్ కార్యకర్తలే!

మూసీ పరిసర ప్రాంతాల రైతులు, వృత్తిదారులతో సీఎం సమావేశమవుతారని, కర్షకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. మూడు రోజులుగా ముమ్మర కసరత్తు చేశారు. కానీ శుక్రవారం జరిగిన యాత్రలో రైతులు పత్తాలేరు. కనీసం చూద్దామన్నా ఎక్కడా వారు కనపడలేదు. ఎక్కడ చూసినా తెల్ల అంగీలు తొడుక్కున్న కాంగ్రెస్ కార్యకర్తలే దర్శనమిచ్చారు. అనేక చోట్ల మెడలో కండువాలు, చేతిలో జెండాలు పట్టుకొని కనిపించారు. వాళ్లు కూడా పెయిడ్ కార్యకర్తలే అవడం గమనార్హం. పాదయాత్రకు తరలివచ్చిన ఒక్కో కార్యకర్తకు రూ.300 చొప్పున ఇచ్చి తీసుకొచ్చారు. మహిళలు ఎక్కడా కనిపించలేదు. రేవంత్‌రెడ్డి జన్మదినం కూడా కావడంతో బయటి నుంచి కొందరు కాంగ్రెస్ నేతలు, అభిమానులు తరలివచ్చారు.




## టీటీడీ తరహాలో గుట్టలో బోర్డు

యాదాద్రి భువనగిరి, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే యాదగిరిగుట్ట దేవాలయానికి బోర్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. తన జన్మదినం సందర్భంగా శుక్రవారం యాదగిరిగుట్టలో సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రెసిడెన్షియల్ సూట్‌లో వైటీడీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోశాలను బెస్ట్ మోడల్ గోశాలగా అభివృద్ధి చేయాలని, గోసంరక్షణకు పాలసీ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆలయ భూసేకరణకు సంబంధించి అన్ని కేసులను క్లియర్ చేయాలని సూచించారు.

## రేవంత్ బర్త్‌డేను అడ్డుకున్న రైతులు

నల్లగొండ సిటీ, నవంబర్ 8: ఐకేపీ సెంటర్‌లో ధాన్యం అమ్మకానికి ఉంచి 20 రోజులైంది.. ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది.. మ్యాచర్ పేరిట కాలయాపన జరుగుతుంది.. ఈ బాధలతో మేముంటే సంబురాలు చేసుకుంటారా? అంటూ నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీ యడవల్లి గ్రామ రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గ్రామంలో ఏర్పాటుచేసిన సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను రైతులంతా అడ్డుకున్నారు.

## లోకం పోకడ




# హామీలు అమలు చేయలేక సీఎంకు భయం

- మాజీ ఎమ్మెల్యే సునీతా మహేందర్‌రెడ్డి



యాదగిరిగుట్ట, నవంబర్ 8: 'ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భయం పట్టుకున్నది. అందుకే ప్రశ్నిస్తున్న మా లాంటి వాళ్ల నోరు మూయించేందుకు గృహ నిర్బంధం చేస్తున్నరు.' అని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి విమర్శించారు. వలిగొండ మండలంలో సీఎం పర్యటన నేపథ్యంలో శుక్రవారం ఆమెను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ క్రమంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. 'రియల్ ఎస్టేట్ వ్యాపారిగా ఉండి ముఖ్యమంత్రిగా మారిన రేవంత్‌రెడ్డి అదే తరహాలో పాలన సాగిస్తున్నరు. ఉచిత బస్సు ప్రయాణాల్లో మహిళలు ఇబ్బంది పడుతున్నా గ్రౌండ్ రిపోర్టు తీసుకోలేని అసమర్థుడు రేవంత్‌రెడ్డి. భువనగిరికి వచ్చి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్టేసి ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని చెప్పాడు. 2 లక్షలు ఇస్తామని చెప్పి 41 వేల కోట్ల మాఫీకి 18 వేల కోట్లే మాఫీ చేశారు. స్వామి మీద ఒట్టేసి చెప్పి ఆ స్వామిని దర్శించుకునేందుకు వచ్చినవ్. నిరుద్యోగులను అంధకారంలోకి నెట్టివేసినవ్. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే ఒక్కటే ఇచ్చి చేతులు దులుపుకొన్నవ్. ప్రజలు వ్యతిరేకిస్తారనే భయంతోనే ముందస్తు అరెస్టులు చేయిస్తున్నవ్. పింఛన్లు పెంచడం లేదు. స్వామివారి విమాన గోపురానికి గతంలోనే ఎందరో దాతలు వి రాళాలు ఇచ్చారు. చాలా బంగారం స్వామివారికి సమకూరింది. వైటీడీఏ సమీక్షలో బంగారు తాపడంపై నోరు మెదకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. వెంటనే బం గారు తాపడంపై స్పష్టమైన ప్రకటన చే యాలి. కేసీఆర్ పాలనలో యాదగిరిగుట్ట దేవస్థాన పునర్నిర్మాణం దాదాపు 95 శాతం పూర్తయింది. ఇంకా 5 శాతం మౌలిక వసతుల పనులు చేపట్టాల్సి ఉన్నది. రేవంత్‌రెడ్డి వచ్చి ఏడాది కావస్తున్నా రూపాయి కూడా కేటాయించలేదు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జరుగడం లేదు. కేంద్రాల వద్ద రైతులు రాత్రింబవళ్లు ఎదురు చూస్తున్నరు' అంటూ మండిపడ్డారు.

## పాదయాత్రను అడ్డుకుంటారనే అరెస్టులు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నార్కట్‌పల్లి, నవంబర్ 8: సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్రను ప్రజలు అడ్డుకుంటారనే భయంతో తమను ముందస్తుగా అరెస్టు చేయడం సిగ్గుచేటని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మండిపడ్డారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని తన నివాసంలో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పరీవాహక ప్రాంతమైన సంగెం వద్ద పాదయాత్ర చేయడం కాదని, మూసీ బాధితుల వద్దకు వచ్చి చేయాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ కార్యకర్తలను నిర్బంధించి, పోలీసుల పహారా మధ్య పాదయాత్ర చేయడంపై మండిపడ్డారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుడుల చుట్టూ తిరిగి మంచి చేస్తానని చెప్పి ఇప్పుడు చెడు చేస్తున్నారని మండిపడ్డారు. ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన రేవంత్‌రెడ్డి.. మాజీ మంత్రులైన కేటీఆర్, హరీశ్‌రావుపై ఆరోపణలు చేయడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. సమావేశంలో రైతు బంధు సమితి మండల మాజీ కన్వీనర్ యానాల అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, పలువురు మాజీ సర్పంచ్‌లు ఉన్నారు.



గృహనిర్బంధంలో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

# ఆద్యంతం సర్కార్ దమనకాండ

- ఉమ్మడి నల్లగొండంలో ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నేతల గృహ నిర్బంధాలు
- అదానీ, ట్రిపుల్ఆర్ బాధితుల అరెస్టులు
- పోలీసుల అదుపులోకి మాజీ ఎమ్మెల్యేలు, అఖిలపక్ష, ప్రజాసంఘాల నాయకులు
- తెల్లవారుజామునే ఠాణాలకు తరలింపు
- భువనగిరి జిల్లాలో 'నిర్బంధం'గా సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పర్యటన

యాదాద్రి భువనగిరి, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా దమనకాండ కొనసాగింది. ఎక్కడికక్కడ ఆంక్షలు, అరెస్టులు, నిర్బంధాలు అమలై ముఖ్యమంత్రి పర్యటన ముగిసింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ఎక్కడివారిని అక్కడే పెద్దఎత్తున ముందస్తు అరెస్టులు, నిర్బంధాలు, హౌస్ అరెస్టులు చేశారు. సీఎం పర్యటనను అడ్డుకుంటారనే కారణంతో బీఆర్ఎస్, బీజేపీతోపాటు కమ్యూనిస్టులు, ప్రజా సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించి రోజంతా అక్కడే ఉంచారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగడి మహేందర్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద చిరుమర్తి లింగయ్యను అదుపులోకి తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని సొంత నివాసంలో, నల్లగొండలో కంచర్ల భూపాల్‌రెడ్డిని గృహ నిర్బంధం చేశారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని బీఆర్ఎస్ నేతలందరినీ ఉదయమే అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల మూసీకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించిన రైతులను సైతం ముందస్తుగా అరెస్ట్ చేశారు. సంగెం వద్ద వేదికపై ఒక్క సీపీఎం నేతను మాత్రమే మాట్లాడించి.. మిగతా చోట్ల సీపీఎం, అనుబంధ సంఘాల నేతలను అరెస్ట్ చేశారు.

**అంబుజా, ట్రిపుల్ ఆర్ బాధితుల నిర్బంధం**

యాదాద్రి జిల్లాలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ, ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పుపై పెద్దఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి. రామన్నపేట పరిధిలో సిమెంట్ కంపెనీకి వ్యతిరేకంగా నిత్యం నిరసనలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహిస్తున్నారు. ఇదే విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతోపాటు బీఆర్ఎస్ నేతలు, ప్రజలు హెచ్చరించారు. దీంతో ఉదయం నుంచే అరెస్టుల పర్వం కొనసాగింది. అయినా కొందరు ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు పాదయాత్ర, సభాస్థలికి చేరుకున్నారు. ట్రిపుల్ అలైన్‌మెంట్ మార్చాలని సభలో రైతులు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. చౌటుప్పల్‌లో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పుతో గుర్రుగా ఉన్న బాధితులను సైతం అదుపులోకి తీసుకున్నారు. వారంతా రెండు రోజులుగా సీఎంను కలిసి తమ గోడు చెప్పుకోవాలని భావించారు. సుమారు 20 మంది బాధితులను అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**భక్తులపైనా ప్రతాపం**

సీఎం రేవంత్‌రెడ్డి తన జన్మదినం సందర్భంగా యాదగిరిగుట్టలో పూజలు చేశారు. ఈ సందర్భంగా సుమారు గంటన్నరపాటు దర్శనాలను నిలిపివేశారు. కొండపైకి వెళ్లకుండా భక్తులను ఎక్కడికక్కడ కట్టడి చేశారు. బస్సులు, ప్రైవేట్ వాహనాలను పైకి వెళ్లనివ్వలేదు. జనం కాలినడక వెళ్లాల్సి వచ్చింది. గుట్టపైన ఉన్న వారిని బస్టాండ్ వద్ద నుం చి కనీసం కదలకుండా పోలీసులు అడ్డుకున్నారు. సీఎంతోపాటు తమను లోనికి అనుమతించాలని కాంగ్రెస్ నేతలు వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.



హైదరాబాద్‌లోని తన నివాసంలో గృహనిర్బంధంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## అందని అధిష్ఠానం ఆశీస్సులు

**రేవంత్‌కు విషెస్ చెప్పని సోనియా, రాహుల్**

- సాయంత్రం వరకు ఎదురు చూసినా నిరాశే
- సీఎం మార్పు ఇక లాంఛనమేనని ప్రచారం

హైదరాబాద్, నవంబర్ 8(నమస్తే తెలంగాణ): పుట్టిన రోజు వేళ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నుంచి శుభాకాంక్షలు అందకపోవడం చర్చనీయాంశమైంది. సాయంత్రం వరకు ఎదురు చూసినా వారి నుంచి బర్త్‌డే విషెస్ అందకపోవడంతో సీఎం నిరాశ చెందినట్టు తెలిసింది. రేవంత్‌ను అధిష్ఠానం దూరం పెడుతున్నదన్న వార్తలకు ఇది మరింత బలం చేకూర్చింది. అంతే కాదు, ముఖ్యమంత్రి మార్పు ఇక లాంఛనమేనన్న ప్రచారం కూడా జరుగుతున్నది. రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు చెప్పిన వారి పేర్లను సీఎంవో కార్యాలయం అధికారిక సోషల్ మీడియా గ్రూప్‌లో పోస్టు చేసింది. ఆ పేర్లలో అధిష్ఠానం పెద్దల పేర్లు కనిపించలేదు. రేవంత్‌రెడ్డి రాజకీయ మార్గదర్శి కేసీ వేణుగోపాల్ కూడా జన్మదిన శుభకాంక్షలు తెలపకపోవడం గమనార్హం. ఏడుసార్లు ఢిల్లీకి వెళ్లి ప్రాధేయపడినా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ దొరకలేదని, ప్రియాంకగాంధీ నామినేషన్ కార్యక్రమానికి వయనాడ్ వెళ్లినప్పటికీ అక్కడ ఆమె కూడా పలకరించలేదని, త్వరలోనే ఆయనను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగిస్తారని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు తాజా ఘటన బలం ఇచ్చినట్టు అయిందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. అదే సమయంలో ఢిల్లీ బీజేపీ ఆయనను దగ్గరకు తీస్తున్నదని, రేవంత్ కోరినప్పుడల్లా ప్రధాని మోదీ, నడ్డా, అమిత్‌షా వంటి కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్లు దొరుకుతున్నాయని పార్టీలోని కొందరు నేతలు చెప్తున్నారు. అందుకు తగ్గట్టుగానే రేవంత్‌కు మోదీ ఉదయం 8:30 గంటలకే శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, సినీ నటుడు చిరంజీవి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లోర్సన్ తదితరులు ఉన్నారు. మరోవైపు, రేవంత్‌రెడ్డికి అధిష్ఠానం పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పలేదన్న విషయం సోషల్ మీడియాకెక్కి విపరీతంగా ట్రోల్ కావడంతో రేవంత్ స్వయంగా నష్టనివారణ చర్యలు చేపట్టారు. రాత్రి 10 గంటలకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. సమయం తీసుకుని మరీ తనకు వ్యక్తిగతంగా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పినందుకు రాహుల్ భయ్యాకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకొంటున్నట్టు రేవంత్ ఆ పోస్టులో పేర్కొన్నారు.

# మూసీ యాత్రకు ఉత్తమ్ డుమ్మా!

- యాదగిరిగుట్ట ఆలయం వరకే రాక
- మూసీ యాత్ర లైట్ అంటూ వెనక్కి..
- మూసీకి సరిహద్దుగా ఉన్న మంత్రి ఉత్తమ్ నియోజకవర్గం

నల్లగొండ ప్రతినిధి, నవంబర్8 (నమస్తే తెలంగాణ): యాదాద్రి జిల్లా వలిగొండ మండలంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్రకు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డుమ్మా కొట్టారు. అప్పటివరకు సీఎంతోనే ఉన్న ఉత్తమ్ ఉన్నట్టుండి హైదరాబాద్ బయలుదేరి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం తన పుట్టినరోజున రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లారు. సీఎంతోపాటు మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ హెలికాప్టర్‌లో గుట్టకు చేరుకున్నారు. అంతకు ముందు రాత్రే రోడ్డు మార్గాన మంత్రి కోమటిరెడ్డి యాదాద్రికి చేరుకున్నారు. సీఎంతోపాటు యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి వారిని దర్శించుకొని, అనంతరం నిర్వహించిన వైటీడీఏ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం, ఉత్తమ్ పాల్గొన్నారు. ఆ తర్వాత లంచ్ అక్కడే చేశారు. ఆ తర్వాత జరిగిన మూసీ యాత్రకు ఉత్తమ్ దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.

**హైదరాబాద్ వెళ్లిన ఉత్తమ్**



ఉత్తమ్ మౌనముద్ర

యాదగిరిగుట్ట నుంచి నేరుగా సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వలిగొండ మండలం సంగెం గ్రామానికి బయలుదేరారు. ఉమ్మడి జిల్లా మంత్రిగా ఉత్తమ్ కూడా కార్యక్రమంలో పాల్గొంటారని అందరూ భావించారు. కానీ ఆయన మాత్రం తన కాన్వాయ్‌లో మూసీ యాత్రకు రాకుండా నేరుగా హైదరాబాద్ వెళ్లిపోయారు. ఆది నుంచి మంత్రి ఉత్తమ్ మూసీ ప్రక్షాళనపై అంటీముట్టనట్టుగానే ఉంటున్నారు. చాలాసార్లు మౌనమే ఆయన సమాధానంగా వస్తున్నది. ఒకటీ రెండుసార్లు మాత్రమే ఈ విషయంపై స్పందించారు. కానీ మూసీ నదికి ఉత్తర సరిహద్దుగా ఆయన సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌లో 30 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నది. మూసీ కాలుష్యం, దాని ప్రభావం ఇక్కడ కూడా ఉంటుం ది. మూసీ నది వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలిసేచోట కూడా హుజూర్‌గర్ నియోజకవర్గమే విస్తరించి ఉన్నది.

**ఉత్తమ్ మౌనముద్ర**

ప్రక్షాళన పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లు కూలగొట్టడం, ప్రభుత్వంపై వ్యతిరేకత రావడం, విపక్షాల విమర్శలు తదితర సమయాల్లోనూ మంత్రి ఉత్తమ్ మౌనమే వహించారు. హైడ్రా, మూసీ విషయంలో సీఎం ఒంటెద్దు పోకడలతో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందన్న ధోరణిని పలుమార్లు ఉత్తమ్ వ్యక్తపరిచినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం.

**ముందస్తు సమాచారం లేదా?**

**వలిగొండ** మండలంలో మూసీ సంకల్ప యాత్ర విషయమై ఉత్తమ్‌కు ముందస్తు సమాచారం లేనట్టు చర్చ జరుగుతున్నది. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు కలిసి యాత్రకు తెరలేపి, మళ్లీ రేవంత్‌రెడ్డిని కలిసి జిల్లా ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తూ ఆహ్వానించినట్టు డ్రామాను నడిపారని పార్టీ వర్గాలే చెప్పుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే రేవంత్ యాత్రకు ఉత్తమ్ దూరంగా ఉన్నట్టు భావిస్తున్నారు. మంత్రి ఉత్తమ్‌తోపాటు సీఎం యాత్రకు జిల్లాకు చెందిన ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జయవీర్‌రెడ్డి కూడా డుమ్మా కొట్టడం చర్చనీయంశంగా మారింది.

# మూసీకి అడ్డొస్తే ముక్కలు చేస్తం

మొదటిపేజీ తరువాయి...

నల్లగొండ ప్రజలు మూసీలోనే పాతరేస్తారని పేర్కొన్నారు. నల్లగొండ ఫ్లోరైడ్ సమస్యతో పుట్టెడు దుఃఖం పడుతుంటే కలిసిరావా? మూసీ పునరుజ్జీవ పథకానికి కలిసిరాకపోతే మూసీ మురికిలో పడి కొట్టుకపోతవు. దిక్కులేని చావు చస్తావ్ అని పరుష వ్యాఖ్యలు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం స్థానంలో ఉన్న రేవంత్‌రెడ్డి హుందాగా వ్యవహరించడం మాని బజారు భాష మాట్లాడటంపై ముక్కున వేలేసుకుంటున్నారు.

**ఫ్లోరైడ్ భూతాన్ని తరిమిందే కేసీఆర్**

మూసీని ఉద్ధరిస్తామని చెప్తూనే బుల్డోజర్లతో తొక్కిస్తాం, మూసీలో ముంచేస్తాం అంటూ రేవంత్ చేస్తున్న వ్యాఖ్యల వెనక అసహనం కనిపిస్తున్నది. నిజానికి ఫ్లోరైడ్ సమస్య నుంచి నల్లగొండకు శాశ్వత విముక్తి ప్రసాదించాలని సంకల్పించేందుకు కేసీఆర్. మిషన్ భగీరథ పథకంతో 2020, 2021 నాటికే నల్లగొండను జీరో ఫ్లోరైడ్ జిల్లాగా మార్చిన ఘనత కేసీఆర్ సొంతం. ఈ మాత్రం కూడా తెలియని రేవంత్ ఇప్పుడు నల్లగొండను మార్చేస్తానని, అక్కడి ప్రజల బతుకులు బాగుచేస్తానని భీషణ ప్రతిజ్ఞలు చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్దాలపాటు ఏలిన కాంగ్రెస్ పాప ఫలితమే నల్లగొండ ప్రజలకు శాపమైందన్న విషయాన్ని మర్చి ఇప్పుడు నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ఉద్యమ నేతగా ఉన్నప్పుడే నల్లగొండపై ప్రత్యేక దృష్టి సారించారు. సీఎం అయ్యాక ఫ్లోరైడ్ రక్కసి నుంచి నల్లగొండను రక్షించారు.

**బీఆర్ఎస్ చెప్తున్నదేమిటి? రేవంత్ ప్రేలాపనలేంటి?**


నిజానికి కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతలు ఎవరూ, ఎన్నడూ మూసీ పునరుజ్జీవానికి వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మూసీ పునరుజ్జీవంపై అభ్యంతరం చెప్పలేదు. అయితే, ఈ పునరుజ్జీవం పద్ధతి ప్రకారం జరగాలని, పునరుజ్జీవం పేరుతో పేదలను బలిచేయవద్దని మాత్రమే చెప్తున్నది. మూసీ పరీవాహక ప్రాంతంలోని పేదల ఇండ్లను కూలగొట్టకుండా కూడా మూసీని ప్రక్షాళన చేయవచ్చని చెప్తున్నది తప్పితే దానికి వ్యతిరేకమని ఏనాడూ పేర్కొన్నలేదు. ఒకవేళ పేదల ఇండ్లు కూల్చాల్సి వస్తే వారికి సరైన న్యాయం చేయాలని మాత్రమే డిమాండ్ చేస్తున్నది. కానీ, రేవంత్‌రెడ్డి అండ్ కో మాత్రం మూసీ ప్రాజెక్టును కేటీఆర్, హరీశ్, బీఆర్ఎస్ అడ్డుకుంటున్నదని ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకొనే ప్రయత్నం చేస్తున్నారు. మూసీ, హైడ్రా విషయంలో బీఆర్ఎస్ పేదల పక్షాన నిలబడడాన్ని జీర్ణించుకోలేకపోతున్న సీఎం రేవంత్ సహనం కోల్పోయి బజారుభాషకు దిగుతుండడాన్ని ప్రజలు గమనిస్తున్నారు.

**వైషమ్యాలు రెచ్చగొట్టే ప్రయత్నం**

మూసీ ప్రాజెక్టులో ఇండ్లు కోల్పోతున్నది హైదరాబాద్‌లోని మూసీ పరీవాహక పేదలు. రేవంత్‌రెడ్డి మాత్రం నల్లగొండలో మాట్లాడుతూ మూసీని అభివృద్ధి చేస్తానంటే బీఆర్ఎస్ అడ్డుకుంటున్నదని ఆరోపిస్తున్నారు. మూసీ పరీవాహక ప్రజలకు అండగా నిలుస్తూ మూసీ ప్రక్షాళనను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పడం ద్వారా.. మీ బాగు కోసం తపిస్తుంటే హైదరాబాద్ ప్రజలు అడ్డుకుంటున్నారని పరోక్షంగా చెప్పడం ద్వారా ఇరు ప్రాంతాల ప్రజల మధ్య వైషమ్యాలు రేకెత్తించే ప్రయత్నాలు ప్రారంభించారు.

**నేనెందులో తక్కువ?**

మూసీ ప్రాజెక్టుకు అడ్డొస్తే ప్రతిపక్ష నేతలను బుల్డోజర్లతో తొక్కిస్తానని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డే చెప్పడంతో నల్లగొండ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరింత చెలరేగిపోయారు. మూసీ ప్రక్షాళన చేస్తామంటే డోజర్లకు అడ్డం పడుతామని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని, అలా వస్తే వారి మీది నుంచి డోజర్లను పోనిస్తామని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. డోజర్ కింద పడుకునే యాక్షన్ చేస్తే డోజర్లను వారి మీది నుంచి పోనిస్తాం తప్ప పనులైతే ఆపేది లేదని తేల్చి చెప్పారు. పదేండ్లు అధికారంలో ఉండి మూసీని సాఫ్ చేయని మీదీ ఒక బతుకేనా? అని ప్రశ్నించారు. కింద ఫ్లోరైడ్ నీళ్లు.. పైన మురికి మూసీ నీళ్లతో ఎప్పుడు చస్తామో తెలువని బతుకులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ ఆశాకిరణంలాగా కనిపించారంటూ సీఎం మెప్పు పొందే ప్రయత్నం చేశారు. రేవంత్‌రెడ్డి ఐదేండ్లు సీఎంగా ఉంటారని, ఆ తర్వాత మళ్లీ సీఎం అవుతారని, అప్పటికి మూసీ పూర్తవుతుందని చెప్పడం గమనార్హం.



తన పుట్టిన రోజు సందర్భంగా యాదగిరిగుట్ట ఆలయంలో పూజల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

**ఫ్లోరైడ్ రహిత జిల్లాగా నల్లగొండ**

**నల్లగొండ** జిల్లాను కేంద్రం పలుమార్లు ఫ్లోరైడ్ రహిత జిల్లాగా ప్రకటించింది. 2022 పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా నల్లగొండ జిల్లాలో మిషన్ భగీరథ (స్వచ్ఛమైన తాగునీటి సరఫరాతో) జిల్లాలో ఒక్క ఫ్లోరైడ్ కేసు కూడా నమోదు కాలేదని కేంద్రం ప్రకటించింది. 2014లో 413 మందికి 1.5 పీపీఎం కంటే ఎక్కువ ఫ్లోరిన్ శాతంఉంది. ఆ తర్వాత ఈ సంఖ్య ప్రతి ఏడాదీ తగ్గుతూ వచ్చింది. 2020 నాటికి పూర్తి ఫ్లోరైడ్ రహిత జిల్లాగా అవతరించింది.